నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 1
శుక్రవారం 26 మే 2023

ఎరువుల దుకాణాల తనిఖీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలో విత్తనాలు, ఎరువుల దుకాణాలను సీడ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా దుకాణాలలో రికార్డులను పరిశీలించి దుకాణాల్లో రైతులకు నకిలీ విత్తనాలు ఎరువులు అమ్మితే దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఖరీఫ్ సీజన్ వస్తునందున రైతులు విత్తనాల కోసం దుకాణాలకు వస్తారని దీన్ని దుకాణ యజమానులు ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలు ఎరువులు అమ్మవద్దని అన్నారు. రైతులకు విత్తనాలు ఎరువులు అమ్మితే రసీదు తప్పక ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మండల అధికారి నదీమ్ ఉద్దీన్, ఎస్ఐ కొనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్ యూనిట్‌పై స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-తాడ్వాయి

సోలార్ పవర్ యూనిట్‌పై స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహనా సదస్సును నిర్వహించారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో గురువారం సోలార్ వినియోగించడం వల్ల విద్యుత్ ఉత్పత్తి చేయు విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సోలార్ డిస్ట్రిక్ట్ మేనేజర్ గంగాధర్, అదనపు డీఆర్డీఓ మురళీకృష్ణ, డీపీఎం సుధాకర్, సోలార్ ఫీల్డ్ ఆఫీసర్ రాము, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

గొర్రెల స్కీంపై

గొల్లకుర్మ నిరాసక్తి

- 8,384 యూనిట్ల పంపిణీకి టార్గెట్
- కొత్తగా డీడీలు తీసింది 502 మందే
- మొదటి విడతలో అసంపూర్తిగా పంపిణీ
- అప్పులు చేసి డీడీలు తీసిన వైనం
- సంవత్సరాల పాటు ఎదురుచూపులు
- సదూర ప్రాంతాల నుంచి మూగజీవుల కొనుగోలు
- లబ్ధిదారునికి చేరేలోగా పలు మృత్యువాత
- గొల్లకుర్మలకన్నా దళారులకే అచ్చొచ్చిన పథకం



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గొల్లకుర్మలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'గొర్రెల పెంపకం అభివృద్ధి పథకం'పై గొల్లకుర్మలు తీవ్ర నిరాసక్తితో ఉన్నారు. పథకం అమలుపై సర్కారు నిర్లక్ష్యం, సదూర ప్రాంతాల నుంచి గొర్రెల కొనుగోలు, మొదటి విడతలో అసంపూర్తి పంపిణీ వల్ల ప్రస్తుతం అంతగా ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో రెండో విడతలో 8,384 గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని లక్ష్యం నిర్ణయించుకున్నప్పటికీ.. ఇప్పటి వరకు కేవలం 502 మంది గొల్లకుర్మలు మాత్రమే కొత్తగా డీడీలు తీశారు. మొదటి విడతలో అప్పులు చేసి మరీ డీడీలు తీసిన లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపింది. సంవత్సరాల కొద్దీ ఆ నిధులను సర్కారు ఖజానాలోనే ఉంచింది. గొర్రెల పంపిణీని పూర్తిగా మరిచింది. దీంతో మళ్లీ డీడీలు కడితే రెండో విడత పంపిణీ చేస్తారో చేయరోననే భయం గొల్లకుర్మలను వెంటాడుతోంది. పైగా సర్కారు సైతం గొర్రెల పంపిణీని ఎప్పుడు ప్రారంభిస్తారో స్పష్టంగా ప్రకటించడం లేదు. మొదటి విడతలో ఈ స్కీం గొల్లకుర్మలకన్నా దళారులకు కాసులు కుర్పించిన విషయం తెలిసిందే.

రాష్ట్ర ప్రభుత్వం గొల్లకుర్మల కోసం 2017లో గొర్రెల పంపిణీ స్కీం ప్రారంభించింది. అందులో భాగంగా పెద్దఎత్తున దరఖాస్తులు ఆహ్వానించింది. 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున పంపిణీ చేస్తామని చెప్పింది. ఇందుకోసం ఒక్కో లబ్ధిదారులు రూ.43,700 చొప్పున డీడీలు కట్టించుకుంది. మొదటి విడతలో 19,106 మందికి పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ.. 10,722 మందికి మాత్రమే పంపిణీ చేసింది. మరో 8,384 మందికి పంపిణీ నిలుపుదల చేసింది. ఇందులో సుమారు నాలుగు వేల మంది వరకు డీడీలు కట్టారు. నాటి నుంచి ఇప్పటి వరకు అటు డీడీలు తిరిగి ఇవ్వలేదు. పైగా గొర్రెల పంపిణీ కూడా చేయలేదు. దీనికితోడు గొర్రెల కొనుగోలుకు సంబంధించి నిజామాబాద్ జిల్లాకు 556 కిలోమీటర్ల దూరంలోని అనంతపురం జిల్లాను ఎంపిక చేశారు. అయితే ఈ స్కీం లబ్దిదారుల కన్నా దళారులకు, కొంతమంది అధికారులకు కలిసి వచ్చింది. ముందుగానే ఆయా జిల్లాలోని అమ్మకందారులతో యూనిట్‌కు తక్కువ ధర ఖరారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి కుచ్చుటోపి పెట్టారు. పైగా తాము సూచించిన వారి వద్దే కొనుగోలు చేయాలంటూ కొర్రీలు పెట్టారు. వాహనాల ట్రాన్స్‌పోర్టు, మీల్స్ ఖర్చులు గొల్లకుర్మలకు అంటగట్టారు. దీంతో ఖర్చులు మోపడయ్యాయి. ఒక గొర్రెల యూనిట్ దళారులు చెప్పిందే కొనడంతో చాలా వరకు జిల్లాకు చేరే వరకు మృత్యువాతపడ్డాయి. అలా ప్రతి యూనిట్‌లో రెండు నుంచి నాలుగు అస్వస్థతకు గురై చనిపోయాయి. ఈ విధంగానూ నష్టం జరిగింది. దీంతో అప్పులు చేసి మరీ కొనుగోలు చేసిన గొల్లకుర్మలు చివరకు వాటిని అమ్ముకునే స్థితికి వచ్చారు.

రెండో విడతకు నిరాసక్తి...

మొదటి విడతలో పథకం అమలు లోపాలమయం కావడంతో రెండో విడతపై గొల్లకుర్మలు నిరాసక్తితో ఉన్నారు. రెండో విడతలో 8384 మందికి యూనిట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ... ప్రస్తుతం కేవలం 502 మంది మాత్రమే కొత్తగా డీడీలు కట్టారు. మొదటి విడతలో డబ్బులు కట్టి ప్రభుత్వం డీడీలు డబ్బులు తిరిగి చెల్లించని 1140 మంది కూడా ఉన్నారు. మొత్తం 1,642 మంది రెండో విడతకు అర్హులుగా తేల్చారు. రెండో విడతలోనూ జిల్లాలోని గొల్లకుర్మలకు ఏపీలోని అనంతపురం, కర్నాటకలోని రాయ్‌చూర్ నుంచి కొనుగోలు చేయాలని సర్కారు నిర్ణయించింది. అయితే మొదటి విడతలో జరిగిన తప్పులను సవరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని దిద్దుబాటు చర్యలు చేపట్టింది. పశువుల కొనుగోలుకు పశుసంవర్ధక శాఖ నుంచి కాకుండా కలెక్టర్ ఆదేశించిన అధికారి లబ్ధిదారులతో కొనుగోలుకు వెళ్తారు. ప్రతి వాహనానికి జియోట్యాగ్ తప్పనిసరిగా చేయనున్నారు.

పకడ్బందీగా పథకం అమలు

రెండో విడతలో పథకం పకడ్బందీగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పూర్తిగా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో పథకం అమలుకానుంది. జిల్లా కలెక్టర్ నియమించిన అధికారి లబ్ధిదారులతో వెళ్లి గొర్రెలను కొనుగోలు చేయనున్నారు. రెండో విడత పథకం పది రోజుల్లో ప్రారంభంకానుంది.

- జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ వి జగన్నాథచారి

గొర్రెలు పంపిణీ చేయాలి



మేము గత కొన్నేళ్లుగా గొర్రెలపై జీవనం కొనసాగిస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ కింద అందజేసే గొర్రెల పంపిణీ కార్యక్రమం మొదట్లో బాగున్నా, ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం అనగా రెండో విడత గొర్రెల పంపిణీలో జాప్యం చేయడం వల్ల ఆర్థికంగా నష్టపోయాం. రెండో విడతలో రాష్ట్ర ప్రభుత్వానికి ముందుగా డీడీ రూపంలో దాదాపు రూ.33 వేల రూపాయలు జమకట్టం. అట్టి డబ్బులు జమకట్టి దాదాపు సంవత్సరాలు గడుస్తున్నా గొర్రెలను పంపిణీ చేయలేదు. అప్పు తెచ్చి డబ్బులు కట్టినం. అటు గొర్రెల పంపిణీ లేక, తెచ్చిన డబ్బులకు వడ్డీ కట్టుకుంటూ వస్తున్నాం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేయాలని కోరుతున్నాం. **- కట్ట గోపి, ముప్కాల్.**

ఇండ్ల స్థలాల కోసం భూ పోరాటం

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఎర్రజెండాలు పాతిన పేదలు

నవతెలంగాణ-కంఠేశ్వర్



భూపోరాటంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భూ పోరాటం ప్రారంభమైంది. గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాల కోసం కొండం చెరువు కట్టపైన 171 సర్వే నంబర్‌లో మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిలో వందలాదిమంది నిరుపేదలు ఇండ్ల స్థలాల కోసం గుడిసెలు వేసి ఎర్రజెండాలను కట్టారు. అనంతరం జరిగిన సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్‌బాబు మాట్లా డుతూ.. నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలను, ఇండ్ల నిర్మాణం కోసం రుణాలను ఇస్తామని వాగ్దానం చేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గత దశాబ్ద కాలంగా ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం, ఇండ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని అన్నారు. అధికారులకు, ప్రభుత్వానికి ఎన్నిసార్లు దరఖాస్తులు పెట్టుకున్నా.. లాభం లేకుండా పోయిందన్నారు. పేద ప్రజలు నివాస స్థలాలు రాకపోవడంతో విసిగి వేసారి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీసుకొని అక్రమ సంపాదన గడిస్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయించటానికి సీపీఐ(ఎం) సిద్ధపడిందని, పోరాటాల ద్వారా మాత్రమే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. 171 సర్వే నంబర్‌లో ఉన్న ఎనిమిదిన్నర ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాలకు గురై కేవలం మూడున్నర ఎకరాలు మాత్రమే మిగిలిందని ఈ భూమిపైన కూడా కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల ధనవంతుల కండ్లు పడి దాన్ని కూడా కాజేసు కోవటానికి ప్రయత్నిస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ భూములను పేదలకు పంచి పట్టాలను మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇండ్ల నిర్మాణం కోసం రుణాలు ఇవ్వాలని కోరారు. అంతవరకు పేదలంద రూ ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్‌రాములు, వెంకటేష్, గోవర్ధన్, నగర కార్యదర్శి పి.సూరి, నగర నాయకులు సుజాత, కటారి రాములు, అబ్దుల్, మహేష్ పాల్గొన్నారు.

ధరణి టౌన్‌షిప్‌లో ఓపెన్ ప్లాట్లు..

- పూర్తయిన ఇండ్లను వేలంపాట ద్వారా విక్రయిస్తాం
- అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-తాడ్వాయి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

జూన్ 5 నుంచి ధరణి టౌన్‌షిప్‌లో ఓపెన్ ప్లాట్లు, వివిధ దశలో పూర్తయిన ఇండ్లను వేలంపాట ద్వారా విక్రయిస్తామని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ప్రీ బిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. జూన్ 5 నుంచి 8 వరకు కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో వేలం పాట ఉదయం 9 గంటల నుంచి కొనసాగుతుందని తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వ్యక్తులు పదివేల రూపాయలు కలెక్టర్ కామారెడ్డి పేరుపై డీడీ రూపంలో చెల్లించి వేలం పాటలో పాల్గొన వచ్చని సూచించారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు తమ వెంట ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా వంటి గుర్తింపు పత్రాలు తీసుకురావాలని చెప్పారు. 100 గజాల ప్లాటు రూ.8 లక్షలతో రిజిస్ట్రేషన్ చార్జీలు కలుపుకొని సొంతం చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జాతీయ రహదారి 44 నుంచి 200 మీటర్ల దూరంలో ధరణి టౌన్షిప్ ఉందని తెలిపారు. ఎటువంటి చిక్కులు లేని ఓపెన్ ప్లాట్లు, వివిధ దశలో నిర్మాణం పూర్తయిన ఇండ్లు సొంతం చేసుకోవాలని చెప్పారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ రవీందర్, రాజీవ్ స్వగృహ ఏజీఎం సత్యనారాయణ, పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ హెల్ప్ లైన్ మొబైల్ యాప్ ద్వారా కొత్త ఓటరు నమోదు చేసుకోవాలి..

ఓటర్ హెల్ప్ లైన్ మొబైల్ యాప్ ద్వారా కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం ఓటర్ల జాబితాల తప్పుల సవరణపై రాజకీయ పార్టీల నాయకులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. 18 ఏండ్లు నిండిన యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మల్టిపుల్ పోర్షన్స్ ఉన్న ఇల్లు లేదా అపార్ట్మెంట్లలో ఒక ఇంటి నెంబర్‌పై వేరువేరు కుటుంబాలు ఓటర్లుగా నమోదు అయితే ప్రతి ప్లాట్, పోర్షన్‌లలో ఉంటున్న కుటుంబానికి ఒక ఇంటి నెంబర్ అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. ఇంటి నెంబర్, సరియైన చిరునామా అప్డేట్ చేయడంలో బీఎల్ఓలు తగిన సహకారం అందిస్తారని చెప్పారు. సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సాయి భుజంగరావు, అధికారులు నవీన్ కుమార్, నరేందర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే



మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నవతెలంగాణ-బిచ్కుంద

తెలంగాణ ప్రభుత్వం ప్రైవేట్ రంగంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి రాష్ట్రానికి ఎన్నో కంపెనీలు తీసుకువచ్చిందని జుక్కల్ నియోజకవర్గంలోని నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేసిన మెగా ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హనుమంత్ షిండే అన్నారు. గురువారం బిచ్కుంద మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే హనుమంత్ షిండే మాట్లాడుతూ 51 కంపెనీల ద్వారా జుక్కల్ నియోజకవర్గంలోని యువతీ యువకులకు వారి అర్హతను బట్టి వివిధ రంగాల్లో ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నట్టు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, అండర్ గ్రాడ్యుయేట్, డిప్లొమా హెూల్డర్స్, బిఫార్మసీ, ఎంఫార్మసీ, హెూటల్ మేనేజ్‌మెంట్, డ్రైవర్స్, నర్సింగ్ కోర్సులు పూర్తి చేసినవారు, బీఈ, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకాం, ఎంబీఏ, ఎంఎస్సీ, ఎంఎస్ సీఎస్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ కంపెనీల నుంచి వచ్చిన ప్రతినిధులు నిరుద్యోగులకు వారు కల్పించే అవకాశాలను తదితర విషయాలను క్లుప్తంగా వివరించారు. మెగా జాబ్ మేళాలో 500 మంది నిరుద్యోగులు పేరు నమోదు చేసుకోగా వారి అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించనునట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకట్రావు దేశాయ్, రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీహరి రాజు, యువ నాయకులు హరీష్ షిండే, నీలుపటేల్, బొల్లిగంగాధర్ మాధవరావు దేశాయి, డాక్టర్ రాజు, బొమ్మల లక్ష్మణ్, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో విజయం ఖాయం : ఎంపీ

నవతెలంగాణ-ఎడపల్లి

రానున్న శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించి అటు కేంద్రంలో, ఇటు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని ఎంపీ అరవింద్ ప్రారంభించారు. అంతకు ముందుగా సాటాపూర్ గేట్‌లో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎంపీ ధర్మపురి అరవింద్‌తో పాటు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జీపీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి


- కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

గ్రామపంచాయతీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో 12,769 గ్రామపంచాయతిలో పనిచేస్తున్న 50 వేల మంది కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గ్రామపంచాయతీ కార్మిక జేఏసీ రాష్ట్ర కన్వీనర్ దాసు, నూర్జహన్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామపంచాయతీ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నూర్జహన్, దాసు, వెంకట్ గౌడ్, ఎండీ ఖాజా మొయినుద్దీన్ మాట్లాడుతూ.. స్వచ్ఛ తెలంగాణలో అగ్రగామిగా నిలిచిన సఫాయి కార్మికులకు సెల్యూట్ కొట్టితే సరిపోదని, జీవో నెంబర్ 60లో పేర్కొన్న విధంగా వెంటనే 19వేల వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా వెయ్యి రూపాయలు పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన సరిపోదని, ధరలు అగ్గిలా భగ్గుమంటుంటే, పంచాయతీ కార్మికుల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్న విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెల్వదా అని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలో పంచాయతీ కార్మికులందరికీ వెంటనే పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన కార్మిక కుటుంబానికి రూ.10 లక్షలు, సాధారణ మరణానికి రూ.5లక్షల నష్టపరిహారాన్ని అందించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కోడ్ లను రద్దు చేయాలని, 8గంటల పని విధానాన్ని యధావిధిగా కొనసాగించాలని, అక్రమ తొలగింపులను ఆపాలని వారు అన్నారు. 2011 జనాభా ప్రకారం 500 మందికి ఒక కార్మికుడు అనే నియమం కాకుండా పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని నేటి అవసరాల ప్రకారం సిబ్బందిని నియమించాలని వారు కోరారు. జీవో నెంబర్ 51 మల్టీ పర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, కార్మిక హక్కుల రక్షణకై రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని వారు కోరారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులు, దళితులు, నిరుపేదలు, మైనార్టీలు కనుక ప్రభుత్వ పథకాలకు అర్హులు కాబట్టి వారికి డబుల్ బెడ్ రూమ్ పథకం, దళితబంధు పథకాన్ని ముందుగా ఇవ్వాలని వారు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. ఒక దిక్కు సుప్రీంకోర్టు సమాన పనికి సమా న వేతనం ఇవ్వాలని 2016 అక్టోబర్ 26న తీర్పును ఇచ్చిన విషయం పరిగణలోకి తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిస్టంను రద్దు చేస్తామని తెలంగాణ ఉద్యమంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకసారి నెమరు వేసుకొని, కార్మిక సమస్యల పరిష్కారం కోసం ముందుకు రావాలని లేనిచో కార్మికుల ఆందోళన తప్పదని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరని, ఉరి కొయ్యలు చెరసాలలో విప్లవాన్ని ఆపలేవు' అన్నట్లుగా నిర్బంధంతో ప్రజా ఉద్యమాలని ఆపాలని భ్రమిస్తే, అట్టి ప్రభుత్వాలు పతనం గాక తప్పవని వారు గుర్తు చేశారు. ప్రజలే చరిత్ర నిర్మాతలని, ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళుతున్న, గ్రామపంచాయతీలో అనేక రకాల పనులు నిర్వహిస్తూ, తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పనిచేస్తు న్న పంచాయతీ కార్మికులను నిర్లక్ష్యం చేస్తే చరిత్ర క్షమించదని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సదస్సుకు గ్రామ పంచాయతీ జిల్లా కార్యదర్శి జంగం గంగాధర్, ఐఎఫ్‌టీయూ భానుచందర్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సదస్సులో గ్రామపంచాయతీ జిల్లా నాయకులు సాగర్, గంగా ధర్, అంజన్న, లక్ష్మీ నవనీత, పద్మ, ఐఎఫ్‌టీయూ నాయకులు జేపీ గంగాధర్, ఇందూర్ రాజయ్య, సీఐటీయూ మాట్లాడారు. కార్యక్రమంలో నాయ కులు సొప్పరి గంగాధర్, న్యావానంది రాజన్న, గోపి, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్మికులు

అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలు

- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-బిచ్కుంద



అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలు

రైతుల వద్దనున్న వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తరలించేందుకు లారీల కొరత తీవ్రత ఏర్పడడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీవో అధికారులు ప్రత్యేక టీంగా ఏర్పడి ఇసుక తరలించేందుకు వచ్చిన లారీలను వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాల్సి ఉంది. కానీ గురువారం మండలంలోని గోపనపల్లి చౌరస్తా రోడ్డుపై మాటు వేసిన ఆర్టీఏ అధికారులు మంజీర పరివాహక ప్రాంతం నుంచి అధిక లోడుతో లారీలు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నా.. ముందు నుంచి పదుల సంఖ్యలో లారీలు, టిప్పర్లు వెళ్తున్న పక్కనే ఉన్న అసిస్టెంట్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ కింది స్థాయి సిబ్బంది ఎవరు లారీలను ఆపకపోగా వాటి విషయం పట్టించుకోకపోవడంతో అక్కడ ఉన్న రైతులు, ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధిక లోడుతో వెళ్తున్న లారీల ద్వారా రోడ్లు ధ్వంసం అవుతున్నాయని ఈ విషయం పట్టించుకోకుండా మామూలు ప్రజలపైన చూపించే ప్రతాపం రోడ్డు రవాణా శాఖ అధికారులు అధికలోడుతో వెళ్తున్న ఇసుక టిప్పర్లు, లారీల పైన చూపెట్టకపోవడంతో అధికారుల పనితీరుపై ప్రజలు పలు సందేహాలు వ్యక్తం చేశారు.

చేపల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం

- జిల్లా మత్స్యశాఖ అధికారి వర్ధ రెడ్డి
- కిష్టాపూర్ గ్రామంలో చేపల పెంపకం చెరువు ప్రారంభం

నవతెలంగాణ-నసురుల్లాబాద్



చెరువును ప్రారంభిస్తున్న దృశ్యం

చేపల పెంపకానికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తుందని, అక్వ సాగు ఎంతో లాభదాయకంగా ఉంటుందని జిల్లా మత్స్యశాఖ అధికారి వర్ధ రెడ్డి తెలిపారు. గురువారం బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో జాతీయ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళ సంఘం ఆధ్వర్యంలో చేపల పెంపకం చెరువును జిల్లా డీఆర్డీఏ ఏపీఓ రాం నారాయన్, డీపీఎం రమేష్ బాబు, ఎంపీపీ రఘు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రఘు, మాజీ జడ్పీటీసీ సతీష్ మాట్లాడుతూ.. రైతులు సంప్రదాయపంటలకు స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణా ప్రభుత్వం చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి వర్ధ రెడ్డి మాట్లాడుతూ.. చేప పిల్లల పెంపకంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ మంచి లాభాలు పొందవచ్చునని వివరించారు. రోజుకు ఉదయం ఒక గంట, సాయంత్రం మరో గంట పాటు వాటి సంరక్షణకు కేటాయించి మిగతా పనులను కూడా చూసుకోవచ్చునని వివరించారు. చేప పిల్లలకు ప్రతి రోజూ దాణా అందేలా చూసుకోవాలని, అప్పుడప్పుడు వాటి కదలికలను గమనిస్తూ ఉండాలని తెలిపారు. కిష్టాపూర్ గ్రామ డ్వాక్రా మహిళలు చేపల పెంపకంకు ముందుకు రావడంపై జిల్లా అధికారులు అభినందించారు. ఈ గ్రామ మహిళ సంఘాన్ని ఇతర సంఘాలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లెన్ బాబురావు, వైస్ ఎంపీపీ కాశీరం, కిష్టాపూర్ ఎంపీటీసీ భారతి, అన్నారం, కిష్టారెడ్డి సర్పంచ్‌లు అంబయ్య కిష్టారెడ్డి, బీర్కూర్ ఎంపీటీసీ సందీప్, మండల కో ఆప్షన్ మెంబెర్ ఆరీఫ్, ఎంపీడీఓలు బానుప్రకాష్, సుబ్రమణ్యం, బిచ్కుంద, మద్నూర్ ఎంపీడీఓ, అంకోల్ క్యాంప్ సర్పంచ్ రాము, ఏపీఎం గంగారాం, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార ఉత్పత్తులపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

మండలంలోని రాయకూర్ గ్రామంలో ఆహార విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పోషక ఆహార ఉత్పత్తులపై అవగాహనా సదస్సును ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జయశంకర్ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ సాయిప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయిప్రసాద్ మాట్లాడుతూ.. ఆహార సాంకేతిక నైపుణ్యత, ఆరోగ్యం, ఉపాధి తదితర సేవలను దత్తత గ్రామమైన రాయకూర్‌కు సేవలను అందిస్తామని తెలిపారు. డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ.. వివిధ రకాల ఉత్పత్తుల ప్రాముఖ్యత, తయారు విలువలు జోడించడం గురించి, కళాశాలలో జరిగే కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.గంగారం, ఎంపీటీసీ అనిల్ పటేల్, ఉపసర్పంచ్ గంగారాం, పి.లక్షయ్య, సీడీపీఓ శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ పద్మావతి, అంగన్వాడీ టీచర్లు రత్నకుమారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
2
శుక్రవారం 26 మే 2023

కేంద్ర మంత్రిని కలిసిన పారిశ్రామికవేత్త

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పైడి రాకేష్ రెడ్డి గురువారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని, ఎంపీ లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి, ఎంపీకి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, పైడి సుచరిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ పోస్ట్‌లకు దరఖాస్తు ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో టీ హబ్ నందు గల బయో కెమిస్ట్రీ-1, రేడియాలజిస్ట్ -1, ల్యాబ్ మేనేజర్-1, రేడియోగ్రాఫర్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశానుసారం తగిన విద్యార్హత గల అభ్యర్థుల నుండి ఈనెల 26 నుండి జూన్ 03 వరకు జీజీహెచ్ కార్యాలయంలో రూమ్ నెంబర్ 43 నందు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అందుకు అవసరమగు దరఖాస్తు ఫారం లు www.nizamabad.telangana.gov.in వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసుకొని దరఖాస్తు ఫారములను భర్తీ చేసి, రూ.500 డిమాండ్ డ్రాఫ్ట్ ఇన్ ఫేవర్ ఆఫ్ " Convenor, GGH Nizamabad" పేరుతో చెల్లించి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సమర్పించాలని పేర్కొన్నారు.

భారత సాఫ్ట్‌బాల్ జట్టులో జిల్లా క్రీడాకారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లా నుండి ఐదుగురు క్రీడాకారులు భారత సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ గురువారం తెలిపారు. జూన్ 13 నుండి 17 వరకు తైవాన్ దేశంలోని తైపిలో జరగనున్న అండర్-15 ఏసియన్ చాంపియన్ షిప్‌లో పాల్గొననున్నట్లు చెప్పారు. గత నెల 8, 9 తేదీల్లో తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయం కోటి హైదరాబాద్ క్రీడా మైదానంలో జరిగిన అండర్ -15 బాలికల భారత జట్టు ఎంపిక పోటీలలో జిల్లా క్రీడాకారులు పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచారి భారత జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ లోని ఆర్డిటి క్రీడామైదానంలో ఈనెల 26 నుండి జూన్ 02 వరకు జరగనున్న శిక్షణ శిబిరంలో పాల్గొంటారని అన్నారు. గురువారం డిచ్ పల్లి మండలం లోని ధర్మారం బీ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో భారత జట్టుకు ఎంపికైన క్రీడాకారులను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో నూతన మెళకువలు నేర్చుకొని తైవాన్‌లో జరిగే ఏషియన్ ఛాంపియన్ షిప్‌లో భారత జట్టును ప్రథమ స్థానంలో నిలిపే విధంగా క్రీడాకరులు కృషి చేయాలి అన్నారు. మున్ముందు ఏషియన్ గేమ్స్, ఒలంపిక్ గేమ్స్ లో క్రీడాకారులు పాల్గొనేలా తాము కృషి చేస్తామన్నారు. మంచి అటతీరును కనబర్చి పేరు ప్రఖ్యాతులు సాధించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి మర్కంటి సుజాత అకాడమీ కోచ్ ఈ.నరేష్ పాల్గొన్నారు.

- అభినందించిన సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ సభ్యులు



క్రీడాకారులను అభినందిస్తున్న సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ సభ్యులు

ఎంపికైన జిల్లా క్రీడాకారులు..

సాంఘిక సంక్షేమ పాఠశాల డిచ్ పల్లి మండలం లోని సుద్దపల్లిలో చదువుతున్న గుగులోత్ సౌందర్య, గోక సాత్విక, గోక శ్రావిక, సాంఘిక సంక్షేమ కళాశాల తాడ్వాయి-కామారెడ్డిజిల్లాకు చెందిన సుంపాక సౌమ్య రాణి, దాసరి సరియు-సాంఘిక సంక్షేమ పాఠశాల డిచ్ పల్లి మండలం లోని ధర్మారం (బీ) ఉన్నారు.

28నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాష్ట్ర స్థాయి క్రీడ పోటీలు ఈనెల 28 నుండి నిర్వహించడం జరుగుతుందని జిల్లా క్రీడల అధికారి ముత్తన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చీఫ్ మినిస్టర్ కప్-2023 ను ఈ నెల 15 నుండి 31 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మండల, జిల్లా స్థాయి పోటీలు ఘనంగా నిర్వహించమని తెలిపారు. జిల్లా స్థాయిలో ఏపికైన క్రీడాకారులు 28 నుండి 31 వరకు రాష్ట్ర స్థాయి క్రీడ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఎంపికైన అథ్లెటిక్స్, కబడ్డీ, ఖో-ఖో, వాలీ బాల్, హ్యాండ్ బాల్, బాడ్మింటన్, బాస్కెట్ బాల్ (మహిళలు, పురుషులు), ఫుట్ బాల్ (పురుషుల), స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, టేబుల్ టెన్నిస్, అర్చరీ (మహిళలు, పురుషుల), కుస్తీ, హాకి, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్ (పురుషులు) క్రీడాకారులకు హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి క్రీడ పోటీలలో నిర్వహిస్తారని, ఈనెల 27 మధ్యాహ్నం రెండు గంటలకు డీఎస్ఏ (డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ) గ్రౌండ్ (పాత కలెక్టర్ గ్రౌండ్), నిజామాబాద్ నందు ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో రిపోర్ట్ చేయాలని, అక్కడ నుండి హైదరాబాద్ వెళ్ళుటకు బస్సులు బయలుదేరుతుందని అన్నారు. మిగతా వివరాలకు 9701177144 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని తెలిపారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

- ప్రముఖ కవి తెలంగాణ రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరం శంకర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని కలిగించే సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రముఖ కవి, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకర్ అన్నారు.ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని గురువారం తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకర్ సందర్శించారు. నిరంతరం సామాజిక కార్యక్రమాలు చేస్తూ అందరికి ఆదర్శంగా వీరి సేవలు నిలుస్తున్నాయని కోనియాడారు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు మనస్సుని కదిలించే కార్యక్రమాలని, నిత్యాన్నదానం చేయడం, విధివంచితులకి సపర్యలు చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం సంస్థ సభ్యులు నాళేశ్వరం శంకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, గౌరవ అధ్యక్షులు ముస్కు రామేశ్వర్ రెడ్డి, దారం గంగాధర్, చందా జగన్మోహన్, తోగర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-మోపాల్

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టీఎస్ ఆర్టీసీ చైర్మన్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు గురువారం పంపిణీ చేశారు. 83 మొత్తం చెక్కుల విలువ : 83,09,628 ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మొత్తం చెక్కులు 12 వాటి విలువ 4లక్షలా47వేలు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కన్నేరామ్, జడ్పిటిసి కమల నరేష్, మండల అధ్యక్షులు శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీనివాస్ రావు, సర్పంచ్ ఇందురి సిద్దార్థ, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్, కార్యకర్తలు నాయకులు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎంసెట్ ఫలితాల్లో ధర్మారం గురుకుల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండలం లోని దర్మారం (బి) తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఎంసెట్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ బి సంగీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చల్ మెడికల్ విభాగంలో జి జోస్న 2348, బి సిందూ 3339ర్యాంకు, యస్ సావిత్రి 3552 ,యస్ శ్రీనిక 3826 , బి సాయి పవన 4398,యస్ శ్రీహిత 6567, యం సంజన 7036 , టి సుష్మ 9103ర్యాంకులు సాధించారు. వీరికి వెటర్నరీ సైన్స్ అగ్రికల్చర్ , హార్టికల్చర్ సీట్లు వస్తాయని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో ఆర్ ధనలక్ష్మి10653 , డి శ్రీనిక13187 , కే సిరివెన్నెల13928 , యస్ కీర్తన16124 , యం చామంతి17613 ర్యాంకులు సాధించారు. వీరికి రాష్ట్రంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో సీటు వస్తుందని వివరించారు. సత్తాచాటిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపక బృందం, సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు.

బోధన్, ఇందూరు విద్రోహశక్తులకు అడ్డాలు

- ఎంపీ అరవింద్
- బోధన్ నుంచే బీజేపీ గెలుపునకు శ్రీకారం

నవతెలంగాణ-నవీపేట్

బోధన్, ఇందూరు ప్రాంతాలు దేశ విద్రోహశక్తులకు అడ్డాలుగా మారాయని ఎంపీ అరవింద్ అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బోధన్ నుండే బిజెపి గెలుపునకు శ్రీకారం పడుతుందని నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ అన్నారు. మండల కేంద్రంలో బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, బిజెపి మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ కర్ణాటక గెలుపుతో సంకలు గుద్దుకుంటుందని, దానివల్ల ఎటువంటి ప్రయోజనం ఉండబోదని అన్నారు. మే 30 నుండి జూన్ 30 వరకు బిజెపి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ఇంటింటికి తీసుకెళ్లాల ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అన్నారు. బూత్ స్థాయి కార్యకర్త నుండి జిల్లా స్థాయి నాయకత్వం పనిచేస్తే గెలుపు బిజెపి పార్టీదేనని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. కొన్ని మీడియా సంస్థలు బీఆర్ఎస్ పార్టీకి కీలుబొమ్మలాగా మారాయని ఈ విషయాన్ని గమనిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఇన్చార్జి మీసాల చంద్రయ్య, పార్లమెంట్ ప్రబారి యెండల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు బస్వ లక్ష్మి నారాయణ, ప్రధాన కార్యదర్శి పి లక్ష్మీనారాయణ,ధన్ పాల్ సూర్యనారాయణ, మోహన్ రెడ్డి, మేడిపాటి ప్రకాష్ రెడ్డి, దినేష్, వినయ్ రెడ్డి, ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, సర్పంచ్ సరీన్, ఎంపీటీసీ రాధా, స్థానిక నాయకులు ఆనంద్, రామకృష్ణ, మువ్వ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

అండగా ఉంటాం.. ఆందోళన వద్దు..

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి



పరామర్శిస్తున్న నగేష్‌రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అండగా ఉంటాం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆసుపత్రిలో నాణ్యమైన చికిత్స చేయించాలని నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్ రెడ్డి అన్నారు. గురువారం ఇందల్ వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మెత్కురి నవీన్ గౌడ్ అమ్మ అనారోగ్యం పాలు కావడంతో నగేష్ రెడ్డి గురువారం వచ్చి నవీన్ గౌడ్‌కు మనోధైర్యాన్ని కల్పించారు. ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఆయన వెంట కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు ఎల్ఐసి గంగాధర్ , డిసిసి డెలిగేట్ సుధాకర్, ఉప సర్పంచ్ బైరయ్య, బద్దంరెడ్డి, కరుణాకర్, తోట రాజన్న వసంతరావు, వెంగల్, నారాయణ, గంగ నర్సయ్య, సాయందర్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ప్రభంజనం సృష్టించిన ఎన్టీఆర్

మాజీ మంత్రి మండవ వేంకటేశ్వరరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రజలే దేవుళ్లు, ప్రజాసేవయే మాదవ సేవా అనే లక్ష్యంతో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నందమూరి తారక రామారావు రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించారని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు చెప్పారు. డిచ్ పల్లి మండలంలోని ధర్మారం(బి) గ్రామ శివారున గల వీహెచ్ఆర్ కన్వెన్షన్లో నిజామాబాద్ జిల్లా తెలంగాణ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో పలువురు హజరయ్యారు. అనంతరం సావనీర్‌ను విడుదల చేశారు. పలువురిని సన్మానించారు. ఈ సందర్భంగా మండవ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల్లోను తెలుగుదేశం మూలాలు ఉన్న నాయకులు ఉన్నారని, తెలంగాణలో పట్వారీ వ్యవస్థను ఎన్టీఆర్ రద్దుచేశారని చెప్పారు. ప్రస్తుత రాజకీయాలను మార్చాలంటే ఎన్టీఆర్ మళ్ళీ రావాలన్నారు. నందమూరి తారక రామారావు అంటేనే ఓ వ్యక్తికాదని, ఓ శక్తి అని తెలుగుజాతి స్ఫూర్తి తెలుగు జాతి ఉన్నంత వరకు వారి గుండెల్లో శాశ్వతంగా ఉంటారని తెలిపారు. మాజీ మంత్రి, బీజేపీ నేత బాబు మోహన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ఖ్యాతిని చాటి చెప్పిన నేత ఎన్టీఆర్ అని, ఆయనకు భారతరత్న కోసం ప్రధాని మోడీని కలుస్తానన్నారు. ఎన్టీఆర్‌కు భారత రత్న ఇచ్చేంతవరకు తెలుగుజాతిగా పోరాటం ద్వారా సాధించుకుందా మన్నారు. ఎన్టీఆర్ వద్ద తాను నటుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా గుర్తింపు తెచ్చుకున్ననట్లు గుర్తు చేసుకున్నారు. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ జీవిత విశేషాల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ కమ్మ సేవా సమితి సభాధ్యక్షులు డాక్టర్ విద్యాసాగర్, కమ్మ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు రామారావు, ప్రవాస భారతీయుడు రవికుమార్, నాయకులు డాక్టర్ గోపికృష్ణ రెడ్డి, యాదగౌడ్, నగేష్ రెడ్డి, కేశవేణు, అమర్నాద్ బాబు, రాజేశ్వర్, రాజేందర్ గడుగు గంగాధర్, హన్మంత్ రెడ్డి, నాయుడు ఆంజనేయులు, బ్రహ్మనందం, పార్టీలకు అతీతంగా పలువురు హాజరయ్యారు.



మాట్లాడుతున్న మండవ వెంకటేశ్వర్‌రావు

పర్యావరణ పరిరక్షణే మానవ మనుగడకు మూలం

ఇందూరు డిచ్‌పల్లి ఎఫ్‌పీఓ చైర్మన్ మాచర్ల నాగయ్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పర్యావరణ పరిరక్షనే మానవ మనుగడకు మూలాధారమని, దేశంలో కాలుష్యం విపరీతంగా పెరిగిందని, ముఖ్యంగా ప్రతి ఒక్కరు కూడా వాహనాలను వాడడం వల్లే పర్యావరణంలో మార్పులు వస్తున్నాయని సంస్థ చైర్మన్ మాచర్ల నాగయ్య అన్నారు. డిచ్ పల్లి ఎఫ్‌పిఓ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. దేశంలో రోజు రోజుకు కాలుష్యం విపరీతంగా పెరుగుతుందని, ప్రతి ఒక్కరు కూడా వాహనాలను వాడడం ఎక్కువైందని, గతంలో ఒక్కో ఇంట్లో అరుదుగా బైక్, కార్ ఉండేవి కాదన్నారు. నేడు ప్రతి ఇంట్లో ఎందరు ఉంటే అందరికి ఒక్కటి లేదా రెండు వాహనాలు ఉన్నాయని, దాని వల్ల కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ప్రజలు, యువకులు ఈ రోజుల్లో నడవడం పూర్తిగా మర్చిపోయారని పేర్కొన్నారు. మొదటగా ప్రతి ఒక్కరు నీటిని, కరెంట్, పెట్రోల్, ఆహారం, పొదుపుగా వాడుకుంటూ వనరులను భవిష్యత్తు తరాలకోసం మనం వాటిని అందించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా చెట్లు నాటాలని పిలుపు ఇచ్చారు. మందులులేని పంటలు పండించే విధంగా రైతులు ముందుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో ఇందూరు డిచ్ పల్లి డైరెక్టర్స్ వేల్పూర్ బుమయ్య, బుమారెడ్డి, సిఈఓ అఖిల, అకౌంటెంట్ సాయినాథ్, రైతులు దేవస్వామి,దేశెట్టి సాయరెడ్డి, నర్సయ్యసాయిలు తదితరులు పాల్గొన్నారు.

కుర్‌కురే ప్యాకెట్లు అమ్మాలని బీడీ కార్మికులపై ఒత్తిడి చేయొద్దు

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేశాయి బీడీ ఫ్యాక్టరీ వారు కుర్‌కురే ప్యాకెట్లు అమ్మాలని బీడీ కార్మికులపై ఒత్తిడి చేయడాన్ని ఆపాల్సిందిగా కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ శివశంకర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. దేశాయి బీడీ ఫ్యాక్టరీ పరిధిలోని బ్రాంచ్ లలో పనిచేస్తున్న బీడీ కార్మికులు, టేకేదారులు, బట్టి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై విచారణ జరిపి కంపెనీపై తగిన చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. దేశాయి బీడీ ఫ్యాక్టరీ వారు 'కురుకురే' అనే స్నాక్స్ చేస్తున్నారని, దాని మార్కెటింగ్‌కోసం బీడీ కార్మికులను బలవంతంగా వినియోగిస్తున్నారన్నారు. కురుకురే ప్యాకెట్లను తీసుకోవాలని, వాటిని అమ్మి ఒక్కొక్క ప్యాకెట్టు ఖరీదు ఐదు రూపాయలు చొప్పున డబ్బు తీసుకురావాలని ప్రతి కార్మికురాలికి టేకేదారులు బలవంతంగా అప్పజెప్పున్నారని అన్నారు. దీన్ని వ్యతిరేకించే వారిపై కక్ష సాధిస్తున్నారని తెలిపారు. కార్మికులకు బట్వాడా చేసేటప్పుడు ప్యాకెట్ల డబ్బును మినహాయించుకుని వేతనం చెల్లిస్తున్నారని అన్నారు. ఒక్కో కార్మికుని వద్దనుండి 300 నుండి 500 వరకు డబ్బును మినహాయించుకొని టేకేదారులు పేమెంట్ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పని దినాలు తక్కువ రావడం. ఆకు తంబాకు సరిగా లేనప్పుడు బయట కొనుక్కొని వచ్చి బీడీలు తయారు చేయటం. సరైన సమయంలో డబ్బులు రాకపోవటం తదితర సమస్యలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ఈ పరిస్థితులలో అదనంగా ఈ కురుకురే బాధ్యతను బీడీ కార్మికులపై పెట్టటం చట్ట విరుద్ధమన్నారు. బీడీ కార్మికులను ఆ బాధ్యత నుంచి తప్పించే విధంగా యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గంగా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ వీవోఏల నిరసన

నవతెలంగాణ-ముప్కాల్/డిచ్‌పల్లి

వీవోఏలు తమ డిమాండ్ల సాధనకు చేస్తున్న సమ్మె 38వ రోజుకు చేరుకుంది. గురువారం మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. వీవోఏలకు కనీస వేతనాలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ రూ.10 లక్షల రూపాయల ఆరోగ్య సాధారణ బీమా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు అరుణ, వీవోఏలు మంజులత, కళావతి, భాగ్యలక్ష్మి, కావ్య, అర్చన, రాధిక పాల్గొన్నారు.



ముప్కాల్ : భిక్షాటన చేస్తున్న వీవోఏలు

డిచ్‌పల్లి:వీవోఏల సేవలను గుర్తిస్తు అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అందరిలాగే తమకు కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వేంటనే నెరవేర్చాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయించడంలో తాము అహర్నిశలు శ్రమిస్తామని ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వివోఏ ఇందల్ వాయి మండల అధ్యక్షురాలు కె సరళ, ప్రధాన కార్యదర్శి కె రాము అన్నారు. భిక్షాటన చేశారు. ఈసందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని తహసిల్దార్ టివి రోజా, ఎంపిడిఓ రాములు నాయక్, ఎంపిఓ రాజ్ కాంత్ రావు ల దృష్టికి తీసుకొచ్చారు. అర్హులైన వారందరికీ సీసీలుగా నియమించాలని, యూనిఫామ్ కేటాయించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ. 10 లక్షల కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని వారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సువర్ణ, కోశాధికారి మమత, సభ్యులు కవిత, సౌమ్య, అరుణ, స్వప్న, అలేఖ్య, రాధికా, లావణ్య, భాగ్య మౌనిక పాల్గొన్నారు.

100శాతం లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న డీపీవో నీలిమ

నవతెలంగాణ-మోర్తాడ్

23-24 ఆర్థిక సంవత్సరానికి 100 శాతం లక్ష్యంసాధించాలని ఐకెపి డిపిఎం నీలిమ అన్నారు. మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన వీవో సమావేశంలో ఆమె మాట్లాడుతూ... బ్యాంక్ లింకేజీ రుణాల గురించి చర్చించారు. ఈ ఆర్థిక సంవత్సరం 35 కోట్ల 52 లక్షల రూపాయల లక్ష్యంగాను నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి మహిళా సంఘానికి రుణాలు అందించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు. రుణ ప్రణాళిక వేసుకొని లక్ష్యం చేరుకునేలా చూడాలని చెప్పారు. రుణాలతో సంఘాలు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిపిఎం ఐబి శ్రీనివాస్, ఏపీఎం ప్రమీల, సీసీలు తదితరులు పాల్గొన్నారు

కంటి అద్దాలు పంపిణీ



కంటిఅద్దాలు అందజేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు చేయించుకున్న సుమారు 150 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు చేయించుకున్న దూరపు చూపు వారికి అద్దాలను సర్పంచ్ సక్కారం అశోక్ పంపిణీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా కంటి పరిశీలిచేసి అద్దాలు పంపించడం పట్ల పలువురు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్ఎం అరుణ,నాయకులు నారాయణ, రమేష్, రాజు,ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్

● ఎస్ఐ మురళి

నవతెలంగాణ-జుక్కల్


దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే సంబంధిత డీలర్‌పై వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు సంయుక్తంగా పీడీయాక్ట్ కేసును నమోదు చేస్తామని జుక్కల్ ఎస్ఐ మురళి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ శాఖ మండల అధికారి నూతన్‌కుమార్‌తో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ, ఏడీఏ నూతన్ కుమార్, ఏవో నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులను మోసం చేయడం మంచిది కాదని వివరించారు.

పిడుగు పాటుతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-పిట్లం


మృతిచెందిన వ్యక్తి

పిడుగు పాటుకు వ్యక్తి మృతి చెందిన ఘటన సిద్దాపూర్ తండా శివారులో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక ఎస్సై విజయ్ కొండ కథనం మేరకు.. మండలంలోని సిద్దాపూర్ తాండకు చెందిన రమావత్ వసురాం (25) బుధవారం పొలం పనుల నిమిత్తం వెళ్లి రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం వెతకగా బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షంతోపాటు పిడుగు పాటుకు పడటంతో గాయాలై మృతి చెంది ఉండడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్స్‌వాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడికి కూతురు ఉంది.

వాహనదారులకు అవగాహన

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని జాతీయ రహదారి పోచారం తండా గేటు వద్ద ఏఎస్ఐ రాములు వాహనదారులకు హెల్మెట్‌పై గురువారం అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసేటప్పుడు తప్పక హెల్మెట్లు ధరించాలని సూచించారు. దాంతో పాటు వాహనాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం ప్రాణంతో చెలగాడటంతో సమానమని అన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల వాహనదారులు సురక్షితంగా తమ గమ్యాన్ని చేరుకుంటారని అన్నారు. వాహన దారులు పాత చాలాన్‌లను తప్పనిసరిగా కట్టుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై ప్రయాణం చేస్తున్నపుడు అతి వేగంతో వాహనాన్ని నడపరదాని తెలిపారు. తనిఖీలో ఏఎస్ఐ రాములు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన

● అన్నదాన కార్యక్రమాలు


ఎల్లమ్మ ఆలయంలో పూజలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని నాయబాది ప్రాంతంలో రేణుక ఎల్లమ్మ నూతన ఆలయ విగ్రహంతో పాటుశ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహాన్ని ఎడపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో కందుకూరి నరహరిగౌడ్ దంపతులు, నట రాజ్‌గౌడ్ దంపతులతో పాటు, శేఖర్‌గౌడ్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకై అవగాహన సదస్సు

నవతెలంగాణ-తాడ్వాయి

జిల్లాలో కిశోర బాలికలలో రక్తహీనత నివారణకు, బాల్యవివాహాల నిర్మూలనకు పనిచేయటానికి వచ్చిన టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, యూనిసెఫ్ సంస్థ ప్రతినిధులకు జిల్లా అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం బాల్యవివాల నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. కిశోర బాలికలలో రక్తహీనత నివారణకు కార్యచరణ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు. టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, యునిసెఫ్ సంస్థ ప్రతినిధులు కృష్ణ, విద్యాలత కిశోర బాలికలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేత

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణానికి చెందిన సల్మా బేగం గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందడంతో ఆమెకు ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సీఎం ఆర్థిక సహాయం ద్వారా రూ.2లక్షలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

నవతెలంగాణ-భిక్కనూర్

తెలంగాణ రాష్ట్రంలో కాషాయం జెండా ఎగరడం ఖాయమని, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని కామారెడ్డి బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన 34 మంది ఇతర పార్టీలకు చెందినవారిని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రజలకు వివరించాలని, ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేస్తున్నారని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో ఎస్‌బీఐ మినీ బ్రాంచ్ పారంభం

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ బోడ్డోల్ల సత్యనారాయణ చేతుల మీదుగా ఎస్‌బీఐ మినీ బ్రాంచ్‌ను సర్పంచ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిని బ్యాంక్‌లో ప్రజలు చిన్న చిన్న పొదుపు చేసుకోవచ్చని అత్యవసర సమయంలో డబ్బులు డ్రా చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పుష్పలత, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండుగకు కుల సంఘాలు సహకరించాలి


మాట్లాడుతున్న సర్పంచ్ వేణు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలో నిర్వహించనున్న ఊరడమ్మ పండుగకు అన్ని కుల సంఘాలు సహకరించాలని పట్టణ సర్పంచ్ తునికి వేణు తెలిపారు. గురువారం గ్రామ సచివాలయంలో కుల సంఘాలతో సమావేశం నిర్వహించి పలు సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్, మాజీ సర్పంచ్ నాగభూషణంగౌడ్, నాయకులు లింబాద్రి, మోహన్‌రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మండలాధ్యక్షుని రేసులో ఆశావాహులు

● ఎవరికి వరిస్తుందో..?

నవతెలంగాణ-బోధన్

ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. రాజకీయ పార్టీలలో మండల స్థాయి పదవులకు పోటీ తీవ్రమయింది. కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం బోధన్, సాలూర మండలాలకు నూతన మండల కమిటీల ఏర్పాటుకు అధిష్టానం చర్యలు చేపట్టడంతో గురువారం బోధన్ పట్టణంలో ఉమ్మడి మండలాలకు సంబంధించిన కార్యకర్తలతో, నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య నాయకులు కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుని వాటిని పరిగణలోకి తీసుకుని అధిష్టానానికి పంపుతున్నట్లు ప్రకటించారు. వారి ఆదేశాల మేరకు మండల కమిటీలను ప్రకటించనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. అయితే


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నూతన మండల కమిటీలలో అధ్యక్ష పదవి కోసం నేనంటే నేనంటు ఆశావాహులు పోటీ పడుతున్నారు. చాలా సంవత్సరాల నుంచి పార్టీకి సేవ చేస్తున్న తమకు నామమాత్రపు పదవులు కట్టబెట్టి బుజ్జగించారని పలువురు వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి బోధన్, సాలూర మండల అధ్యక్ష పదవులు అధ్యక్ష పదవి చేపట్టని సీనియర్లకే ఇవ్వాలని పలువురు అంతర్గతంగా చర్చిస్తూ పోటీలో ఉన్నట్లు సమాచారం. మాజీ యూత్ లీడర్, ఓ గ్రామ సొసైటీ చైర్మెన్, మాజీ ఎంపీటీసీ, మాజీ జడ్పీటీసీ, ఓ గ్రామ సర్పంచ్, మరో రేషన్ డీలర్ మండల అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో తెలంగాణ సర్కారుపై జనంలో కొంత వ్యతిరేకత ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీలో నూతంగా ప్రకటించే నూతన మండల కమిటీలలో ఉత్సాహవంతులయిన వారికే అవకాశం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ప్రభావం తెలంగాణాలో తప్పకుండా ఉండే అవకాశం ఉంటుందని, కావున రాబోయే శాసనసభ ఎన్నికల్లో బోధన్‌లో పార్టీ విజయం కోసం అందరిని కలుపుకునిపోయే నాయకుడు మండల అధ్యక్షునిగా ఉంటే బాగుంటుందని పార్టీ కార్యకర్తలు పేర్కొంటున్నారు. మరి బోధన్, సాలూర మండలాల అధ్యక్ష పదవులు ఎవరికి వరిస్తాయో, ఆశావాహుల కోరిక నెరవేరుతుందో లేదో వేచి చూడాల్సిందే.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

● పలుచోట్ల భిక్షాటన

నవతెలంగాణ-వర్ని/బోధన్

మండలంలోని ఐకేపీ వీఓఏలు జిల్లా కమిటీ పిలుపు మేరకు తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ దుకాణ సముదాయాలలో బిక్షాటన చేస్తూ గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీవోఏల అధ్యక్షురాలు షమీం మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి వీవోఏల కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10లక్షల సాధారణ బీమా కల్పించాలని, వీవోఏలకు గౌరవ వేతనం, డీఆర్డీఏ అకౌంట్ నుంచి నేరుగా వీవోఏ అకౌంట్‌లో జమ చేయాలని, వీవోఏలకు శ్రీనిధి నుంచి ఇన్సెంటివ్ రద్దుచేసి గౌరవ వేతనంగా నెలకు రూ.5000వేలు ఇప్పించాలని, సెర్పు నుంచి ఐడీ కార్డులు ఇప్పించాలని, అర్హత కలిగిన వీవోఏలను సీసీలుగా ప్రమోషన్స్ ఇవ్వాలని


బోధన్‌లో భిక్షాటన చేస్తున్న వీవోఏలే


వర్నిలో..

డిమాండ్ చేశారు.

బోధన్ :

తమ డిమాండ్ల సాధనకై గత నెల రోజులుగా సమ్మె చేస్తున్న ఐకేపీ వీఓఏలు గురువారం సమ్మె శిబిరం నుంచి వెళ్లి దుకాణాల వద్ద భిక్షాటనతో తమ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వీఓఏల డిమాండ్లను, సమస్యలను తక్షణమే స్పందించి పరిష్కరించాలని అన్నారు. కనీస వేతనం రూ.18వేల వేతనం ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలని, 10లక్షల సాధారణ ఆరోగ్య బీమా కల్పించాలని కోరుతూ బిక్షాటన చేపట్టారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, నాగయ్య, భూమయ్య, సుభాష్, శ్రీలత, గంగాదేవి, కృష్ణవేణి, ఈశ్వరి, భూలక్ష్మి, సంతోషి, నాగజ్యోతి, స్వప్న, జట్టి లక్ష్మి, సౌజన్య, రజిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ బెంగాల్‌లో జరిగే వాలీబాల్ పోటీలకు ఎంపిక



పోటీలలో పాల్గొన్న అభ్యర్థులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

వెస్ట్ బెంగాల్ జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు నెమ్లీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థి వి.నరేందర్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట రమణ గురువారం తెలిపారు. మండల స్థాయి, జిల్లా స్థాయి ప్రతిభ కనబరిచిన విద్యార్థి నరేందర్ ఈ నెల 28 నుంచి 31 వరకు జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ వెస్ట్ బెంగాల్‌లో పాల్గొననున్నాడు. దీంతో వీరి ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, సర్పంచ్ పందిరి గంగామణి భూమేష్, ఎంపీటీసీ నాయిని రాధ హనుమాన్లు, పీఈటీ సురేందర్, ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు ప్రతాప్‌సింగ్, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు

బాన్సువాడ పారిశ్రామిక రంగ అభివృద్ధికి కృషి

● డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ పురపాలక సంఘం పరిధిలోని ఆటోనగర్‌ను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడ మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా 6 కోట్ల 80 లక్షల రూపాయలతో ఆటోనగర్‌లో మౌలిక సదుపాయాల కల్పన తదితర పనులను స్థానిక ఆర్డీఓ రాజాగౌడ్, మున్సిపల్ చైర్మన్ శ్రీ గంగాధర్, రైతుబంధు జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరతగితిన పనులను పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. పురపాలికలో నిధులు లేకపోయినప్పటికీ ఉన్న నిధులతో ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను


భూమిపూజ చేస్తున్నడీసీసీబీ చైర్మెన్

కల్పిస్తున్నామన్నారు. ఆటోనగర్ అభివృద్ధికి ప్రత్యేక నిధుల కోసం ప్రణాళికలను సిద్ధం చేసి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించామన్నారు. తక్షణ మౌళిక సదుపాయల కల్పనలో భాగంగా ఉన్న నిధులతో ఈ పనులను చేపట్టినట్లు వివరించారు. అనంతరం తిర్మలాపూర్ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కొత్తబాద్ గ్రామంలో 30 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న 40వేల లీటర్ల వాటర్ ట్యాంకు, అంతర్గత పైపులైన్ పనులకు, రూ.25లక్షల నిధులతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమిపూజ చేశారు. రూ.10లక్షలతో నిర్మించనున్న డ్వాక్రా సంఘం భవనానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీ మోహన్ నాయక్, ఎంపీపీ నీరజ వెంకట్ రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మ గోపాల్‌రెడ్డి, తిర్మలపూర్ ఎంపీటీసీ సునీత మల్లారెడ్డి, తిర్మలాపూర్ సర్పంచ్ శ్రీ జిన్న రఘురామయ్య, కొత్తబాద్ సర్పంచ్ అంకిత సాయగౌడ్ తదితరులు హాజరయ్యారు.

కలెక్టర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కల పెంపకం


మొక్కలు నాటుతున్న అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

కామారెడ్డి కలెక్టర్ పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో జేపీఎస్‌లతో కలిసి మొక్కలను నాటినట్టు ఎంపీడీవో కార్యాలయ అధికారులు తెలిపారు. గురువారం పడంపల్లి, జుక్కల్, బిజ్జల్‌వాడి, మాదాపూర్, హంగర్గ, చండేగాం, కౌలాస్, మహమ్మదాబాద్, లాడేగాం, చిన్నఎడ్గి, కత్తల్‌వాడి గ్రామాలలో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటే విధంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు, జేపీఎస్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-రామారెడ్డి

కాంగ్రెస్ పార్టీలో రామారెడ్డి గ్రామానికి చెందిన పలువురు జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దినదినం ప్రజాధారణ పెరుగుతుందని, కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవమే లక్ష్యంగా, కాంగ్రెస్ శ్రేణులు పనిచేస్తున్నాయని, ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డికే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంటి పేరు, తోక పేరులు పెట్టుకోకుండా కొందరు నాయకులు గ్రామాల్లో రాజకీయాలు చేస్తున్నారని, దమ్ము ధైర్యం ఉంటే, తోక పేర్లు, ఇంటి పేర్లు పెట్టుకొని తిరగాలని డిమాండ్ చేశారు. చంద్రశేఖర్‌రావుపై వ్యతిరేకత తనపై వస్తుందని పేర్లు పెట్టుకోవడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో కందుల రాజయ్య, కందుల లింగం గాండ్ల రాజయ్య, వడ్డే ఎల్లయ్య తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిరెడ్డి మహేందర్‌రెడ్డి, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు వడ్ల లక్ష్మీరాజం, నామాల రవి, నరసింగరావు, గిర్ని రాజేందర్, గంగారెడ్డి, నర్సింలు, భాస్కర్ తదితరులున్నారు.

కంటి వెలుగు సిబ్బందిని సన్మానించిన సర్పంచ్


సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోర గ్రామంలో కంటి వెలుగు వైద్య సిబ్బందిని సర్పంచ్ గోదావరి గణేష్ వారిని గురువారం శాలువాలతో సన్మానించారు. 20 రోజుల పాటు వైద్య సిబ్బంది గ్రామ ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు చేయడంతో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గిరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీలుగతో పంట పొలాలకు భూసారం

నవతెలంగాణ-పిట్లం

పంట పొలాల భూసారం పెంపొందించుటకు జీలుగ విత్తనాలు తోడ్పడతాయని జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిల్లర్గి సింగిల్ విండో పరిధిలోని మండల కేంద్ర సహకార సంఘంలో జీలుగా బస్తాలను జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్ శపథంరెడ్డితో కలిసి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ గాను రైతులు తమ


జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

పంట పొలాల భూసారం పెంపొందించుకొనుటకు గాను జీలుగ విత్తనాలు వాడాలని సూచించారు. 30 కిలోల బస్తా ఒక్కంటికి రూ. 843 చెల్లించి లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు పుట్టి రాములు, డైరెక్టర్ డాకూరి వెంకట్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

నవతెలంగాణ-తాడ్వాయి


స్వామి (ఫైల్)

మండలంలోని కన్కల్ గ్రామానికి చెందిన మంగలి స్వామి (32) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కన్కల్ గ్రామానికి చెందిన స్వామి కామారెడ్డి పట్టణంలో మంగలి షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. భార్యాభర్తలు గొడవ పడటంతో బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాత్రి వరకు ఇంటికి రాలేదు. రాత్రి, గురువారం ఉదయం బంధువుల ఇండ్లలో చుట్టూ పక్కల ప్రాంతాల్లో అతని ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. దీంతో తల్లి గురువారం తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై తాడ్వాయి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే నిధులతో పైప్‌లైన్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే నిధులతో పైప్‌లైన్ పనులను ఎంపీపీ యశోదా నీలుపటేల్ బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మండలంలోని గుండూర్ జీపీలో ప్రారంభించినట్టు సర్పంచ్ దేవిదాస్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవిదాస్ మాట్లాడుతూ.. నీరు గ్రామస్తులకు అన్ని కాలనీలలో సరఫారా కావాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే షిండేకు స్థానిక బీఆర్ఎస్ మండల నాయకులు విన్నవించగా స్పందించి రూ.4లక్షల నిధులను మంజూరు చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రకాశ్ పటేల్, మాజీ ఎంపీపీ శెట్కార్ బస్వంత్ రావ్, గ్రామపెద్దలు కాశీనాథ్ పటేల్, మారుతి పటేల్, బాలాజీ పటేల్, హన్మంత్, దత్తు తదితరులు పాల్గొన్నారు.


పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

27న ఉద్యోగ మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 27 న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పరమేశ్వర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళ నాలుగు కంపెనీలతో నిర్వహిస్తారని, వయోపరిమితి 32సంవత్సరాలలోపు ఉండాలని, ఆసక్తి గల నిరుద్యోగ యువతి, యువకులు ఉద్యోగమేళాలో పాల్గొనాలని తెలిపారు. డిగ్రీ చదివి ఉండాలని శివాజీ నగర్ ఉపాధి కార్యాలయం నిజామాబాద్‌లో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 8099793317, 6305743423, 9959456793, నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. అభ్యర్థులు ఉద్యోగమే లకు వచ్చేటప్పుడు బయో డేటా, ఆధార్ కార్డు, పాసుపోర్టు సైజు ఫోటో 4, ఎస్ ఎస్ సి మెమో, అభ్యర్థి సర్టిఫికెట్స్ తీసుకురావాలని పేర్కొన్నారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత



నవతెలంగాణ-ముప్కాల్

వేంపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో చింతలకుంట చెరువు వద్ద జరుగుతున్న మట్టి పనులను పరిశీలించి కూలీలకు తగిన సూచనలను అందజేశారు. కొలతల ఆధారంగా పనిచేసి తగిన దినసరి కూలిని పొందాలని కూలీలకు ఆమె సూచించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఆమె వెంట పంచాయతీ కారోబార్ కిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్ జగదీష్, ఉపాధిహామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థిసంఘాల నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిబంధనలకు విరుద్ధంగా ప్రారంభమైన నారాయణ కార్పొరేట్ విద్య సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఐక్యకారచరణ కమిటీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం నిజామాబాద్ నగరంలోని సుభాష్ నగర్ ప్రాంతంలో నారాయణ విద్యా సంస్థలో ఫ్లెక్సీలు, బ్రోచర్లను ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్బి, పిడిఎస్యు టివియువి, జీవిఎస్ యునియన్‌ల ఆధ్వర్యంలో చింపి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థ ఆర్జెడి నుంచి



నిరసన తెలుపుతున్న నాయకులు

పర్మిషన్ ఉందంటూ విద్యార్థుల తల్లితండ్రులను మోసం చేస్తున్నారని, కనీస నిబంధనలు పాటించకుండా రాత్రికి రాత్రి ఫ్లెక్సీలు, బ్రోచర్లతో ఎక్కడో వచ్చినా ర్యాంకులు మార్కులను నిజామాబాద్ లో ప్రచారం చేస్తూ తల్లితండ్రులను మోసం చేసి అడ్మిషన్లు చేస్తున్నారని అన్నారు. కనీసం ఆట స్థలం, ఫైర్ సేఫ్టీ లేకుండా, భవనం మున్సిపల్ పర్మిషన్ లేకుండా, ఆర్జెడి పర్మిషన్ ఏవిధంగా ఇస్తారని మండి పడ్డారు. పునర్ సమీక్షించి ఆర్జెడి నారాయణ విద్యా సంస్థ అనుమతిని రద్దు చేయాలని, జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ విద్యా సంస్థపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్బి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.మహేష్ రెడ్డి, పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు ఆశ్రుద్దీన్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పి.మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, జిల్లా కమిటీ సభ్యులు దినేష్, నగర సహాయ కార్యదర్శి నవీన్ కృష్ణ, ఎస్ఎఫ్ఐ నగర సహాయ కార్యదర్శి సందీప్, నగర నాయకులు అజాద్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్‌పల్లిలో స్వర్ణామృత పంపిణీ



స్వర్ణామృతం పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ- మోపాల్

మండలంలోని ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం నర్సింగపల్లిలో గురువారం "స్వర్ణామృత" ప్రాశన కార్యక్రమం జరిగిందని ఆలయ ధర్మకర్త శ్రీమాన్ నర్సింహారెడ్డి తెలిపారు. 15సంవత్సరాలలోపు వయసుగల పిల్లలకు ఈ దివ్యౌషధం ఉచితంగా తొమ్మిది సంవత్సరాల నుండి దాదాపు 3 లక్షల మందికి ఇచ్చామని చెప్పారు. ఈ ఔషధం తీసుకున్న పిల్లల్లో రోగ నిరోదక శక్తి పెరగడంతో పాటు చలాకీగా ఉండడం ధారణ శక్తి జ్ఞాపకశక్తి అపారంగ పెరగడం చూసామని అన్నారు. కార్యక్రమంలో నర్సింహ్మా రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ కుమారాచార్య తో పాటు రమేష్, నర్సారెడ్డి, రవిందర్ యాదవ్, నరాల సుధాకర్, మారుతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చేపల స్టాళ్లు పెట్టుకునేవారు దరఖాస్తు చెసుకోండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

చేపలు, రొయ్యల వంటకాలలో శిక్షణ పొందిన ఔత్సాహికులు స్టాళ్ల ఏర్పాటు చేసుకోదలచిన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మత్స్య శాఖ అధికారి జి.రాజనర్సయ్య తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో జూన్ 8, 9, 10 న రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా నిజామాబాద్ పట్టణంలోని ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్ నందు "ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ (చేప ఉత్పత్తుల ఆహార మేళ)" నిర్వహించానున్నారని అన్నారు. ఇందులో భాగంగా చేపల పులుసు, చేపల ఫ్రైతోపాటు వివిధ రకాల చేపల వంటకాలు, ఫిష్ బర్గర్, ఫిష్ సమోస, ఫిష్ పకోడి, ఫిష్ బిర్యాని, ఫిష్ సూప్స్, ఫిష్ కట్లెట్స్, ప్రాన్స్ పకోడి, జిల్లా వాసులకు అందుబాటులో తెచ్చే విదంగా (20) ఫిష్ స్టాల్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఈ వంటకాల మీద జిల్లాలోని (17) మంది మహిళలకు హైదరాబాద్ నితం ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ ఇస్తున్నారని అన్నారు. సరసమైన ధరలకే అందుబాటులో ఉండే విధంగా సన్నాహాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దరఖాస్తులు 5 రోజుల వ్యవదిలో జిల్లా మత్స్యశాఖధికారి కార్యాలయంలో సమర్పించాలని చెప్పారు. మిగతా వివరాలకు ఫోను నెంబర్ 9440618089 కు సంప్రదించాలని అన్నారు. స్టాళ్ల ప్రాధాన్యత పరంగా కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

గురుకుల ఉపాధ్యాయుల పరీక్ష కోసం ఉచిత కోచింగ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ నిరుద్యోగ అభ్యర్థులకు గురుకుల ఉపాధ్యాయుల పరీక్షకు బిసీ స్టడీ సర్కిల్ నిజామాబాద్‌లో ఉచిత కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు ఆన్లైన్లో www.tsbcstudycircle.cgg.gov.in వెబ్సైట్ ద్వారా ఈనెల 28 లోపు అప్లై చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థి సంవత్సర ఆదాయం ఐదు లక్షలకు మించరాదని, అభ్యర్థుల ఎంపిక విధానం డిగ్రీ / బీఈడీ పరీక్షలో పొందిన మార్కులు., రిక్రూట్మెంట్ ఏజెన్సీ సూచించిన విధంగా ు రిజర్వేషన్ ప్రకారం ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం స్టైపెండ్ స్టడీ మెటీరియల్ ఇవ్వబడుతుందని, పూర్తి వివరాలు పైన తెలిపిన వెబ్ సైట్‌లో లభించునని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెం: 08462-241055 ను సంప్రదించగలరు. (లేదా) సుభాష్ నగర్ లోని నిర్మల హృదయ కాలేజికి ఎదురుగా ఓల్డ్ బీఎస్ఎన్ఎల్ బిల్డింగ్ రెండవ అంతస్తులో గల బీసీ స్టడీ సర్కిల్ నందు సంప్రదించాలని పేర్కొన్నారు.

గోవింద్‌పేట్ ఆర్ఓబీపై బీటీ రోడ్డు పూర్తి :ఎంపీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మూడు నెలల క్రితం ప్రారంభించిన గోవింద్ పేట ఆర్ఓబిపై బీటీ రో డ్డు పూర్తిచేసినట్టు ఎంపీ అర్వింద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఓబి పనులు సంబంధిత కాంట్రాక్టర్ నాసిరకంగా చేపట్టడంతో ప్రారంభించిన మూడు నెలలకే కంకర తేలుతుంది అనే విషయాన్ని మీడియా, స్థానిక ప్రజల ద్వారా సమాచారం తెలుసుకున్నట్టు పేర్కొన్నారు. వారం రోజుల్లోగా ఎట్టి పరిస్థితుల్లోను ఆర్ఓబిపై బీటీ రోడ్డు వేయాలని, లేకుంటే చర్యలు తప్పవని సంబంధిత కాంట్రాక్టర్‌కు, అధికారులకు హెచ్చరించడంతోపాటు రైల్వే అధికారులపై సైతం ఒత్తిడి పెంచామని తెలిపారు. ప్రతిరోజు అటు రైల్వే అధికారులతో, కాంట్రాక్టర్‌తో సంప్రదింపులు చేసి బీటి రోడ్డు పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. మరోసారి పనులు నాసిరకంగా చేపడితే సహించేది లేదని పేర్కొన్నారు.

రెండోవార్డులో పారిశుద్ధ్య కార్యక్రమం



మురుగు కాలువలు శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని రెండవ వార్డులో జిరాయత్ నగర్, చేనేత కాలనీ, నకాశ్ కాలనీ, వడ్డెర కాలనీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కౌన్సిలర్ సంగీతా ఖాందేష్, సానిటరీ అధికారి మహేష్ తదితరులు విచ్చేసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంగీతా ఖాందేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆదేశాల అనుసారం, నియోజకవర్గ ఇంచార్జి రాజేశ్వర్ రెడ్డి సూచనల మేరకు వార్డులో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మురికి కాలువలను శుభ్రం చేయడం, ముళ్ల పొదలను తొలగించడం జరుగుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఇంచార్జి చక్రధర్, జంబి హనుమాన్ మందిర కమిటీ మాజీ చైర్మన్ చౌకే లింగం, నాయకులు ఖాందేష్ సత్యం, శర్మ వెంకటరమణ,భూమేశ్వర్ మున్సిపల్ సిబ్బంది జవాన్ శంకర్ కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ అవార్డుల ప్రధానోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మేరు సంఘంలో గురువారం మీవా ఆధ్వర్యంలో మేరుకుల విద్యార్థులకు10వ తరగతి, ఇంటర్ లో వచ్చిన మార్కులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కొట్టూర్ గిరిరాజ్, ఉపాధ్యక్షులు కుక్కు వినోద్, దీకొండ కిషన్, కొట్టూర్ ప్రవీణ్ రాజ్, మేరు సంఘం అధ్యక్షులు రాజుల దేవి, రవినాథ్, ప్రధాన కార్యదర్శి దీకొండ లక్ష్మణ్, కోశాధికారి సంఘవి గంగాధర్, మేరు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం.

- **బీఆర్ఎస్ మండల నాయకులు**

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ గ్రామంలో గల క్రషర్ విషయంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిపై జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, ఏర్గట్ల సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్ మాట్లాడుతూ... మంత్రి ప్రశాంత్‌రెడ్డి బాల్కొండ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆయనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, మంత్రి ప్రశాంత్ రెడ్డిని మానాల మోహన్ రెడ్డి తిడితే పెద్దోడు కాలేడని తెలిపారు. ఇటువంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితువు పలికారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి గతంలో సొసైటీ చైర్మెన్‌గా ఉన్నప్పుడు రైతులు ఎరువులకోసం క్యూలో నిలబడితే దొంగ చాటుగా, అక్రమంగా ఎరువులను లోడ్లకు లోడ్లు తరలించింది నిజం కాదా.. అని అడుగుతున్నామని అన్నారు. మంత్రి బంధువులు వ్యాపారాలు చేసినంత మాత్రాన మంత్రిపై ఆరోపణలు చేయడం తగదని, నీ వ్యాపారాలవల్ల నష్టపోయిన బాధితులు లేరా అని అడుగుతున్నామని తెలిపారు. గతంలో నీవు కమీషన్ల కోసం అవినీతిగా చేసిన పనులను ప్రజలందరికీ తెలిసేలా ఏర్గట్ల తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బయటపెడతామని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒకటేనని, ప్రజలు వారికి కర్రుకాల్చి వాతపెట్టడం ఇంకా ఎన్నో రోజులు లేదని అన్నారు. కార్యక్రమంలో తడపాకల్ సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాష్,తాళ్ళ రాంపూర్ పిఏసీఎస్ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షులు సున్నపు అంజయ్య,బీఆర్ఎస్ నాయకులు కట్కం సాగర్, బద్దం ప్రభాకర్, గద్దె గంగారాం, ముక్కెర దేవన్న, కట్కం సామంత్, నర్ర అశోక్, లక్కం నర్సయ్య, మూడ్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

జీలుగ విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న సంఘం అధ్యక్షులు

నవతెలంగాణ- ఆర్మూర్ /ఏర్గట్ల

మండలంలోని పిప్రి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గురువారం అధ్యక్షులు సోమ హేమంత్ రెడ్డి ఆధ్వర్యంలో జీలుగు విత్తనాలు రైతులకు సబ్సిడీపై పంపిణి చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుండా లింగన్న, ఏఈవో వసంత లక్ష్మీ సొసైటీ సీఈఓ హన్మాండ్లు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు బట్టపురం చిన్న భోజరెడ్డి, రైతు సోదరులు పాల్గొన్నారు.

ఆలూర్ మండల కేంద్రంలో...

ఆలూర్ మండల కేంద్రం సొసైటీలో చైర్మన్ కళ్లెం బోజారెడ్డి ఆధ్వర్యంలో గురువారం జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భోజకాల చిన్నారెడ్డి, సర్పంచ్ మోహన్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీ మల్లేష్, సొసైటీ డైరెక్టర్ మల్లారెడ్డి, రాములు పాల్గొన్నారు.టోతో పెట్టండి...



ఏర్గట్లలో విత్తనాలు పంపిణీ చేస్తున్న సంఘం అధ్యక్షులు

ఏర్గట్ల:ఏర్గట్ల పిఏసీఎస్‌లో సంఘ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య రైతులకు సబ్సిడీ జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 30 కేజీల సంచికి సబ్సిడీ పోను రైతులు 842 రూపాయలు చెల్లించి తీసుకోవాలని కోరారు. రైతులు వారి వెంట ఆధార్ కార్డు, పట్టాపాస్ బుక్ జిరాక్స్‌లు, మొబైల్ నంబర్ తమ వెంట తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, జడ్పిటీసి గుల్లే రాజేశ్వర్, సర్పంచులు గుల్లే లావణ్య గంగాధర్, పత్తిరెడ్డి ప్రకాష్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, ఏర్గట్ల పిఏసీఎస్ వైస్ చైర్మన్ సిగసారం గంగారాం, రైతు బంధు మండలాధ్యక్షులు సున్నపు అంజయ్య రైతు బంధు జిల్లా మెంబర్ నెరేళ్ళ లింగారెడ్డి, ఏఓ అబ్దుల్ మాలిక్, తాళ్ళ రాంపూర్ పిఏసీఎస్ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి,సంఘం డైరెక్టర్లు బద్దం ప్రభాకర్, గొలిప్యాక శ్రీనివాస్, బద్దం హన్మాండ్లు,జుంగల పెద్ద గంగారాం, రేండ్ల రాజారెడ్డి పాల్గొన్నారు

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసేదెప్పుడు?

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ లో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని ఏకైక డిమాండ్‌తో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులందరూ సమిష్టిగా కంప్యూటర్ సైన్స్ బిల్డింగ్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ దత్త హరి మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో మొత్తం ఖాళీలు 66 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు 53 మంది ఉన్నారని, ప్రభుత్వం ఈ 53 మందిని రెగ్యులరైజ్ చేసిన మిగిలిన 11 పోస్టులు ఖాళీగా ఉంటాయని అన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీ ా 53 మంది మంజురైన పోస్ట్ లోనే ఉన్నారని తెలిపారు.



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

అందరూ రోస్టర్ పాయింట్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ యూజీసీ మామ్స్ రూల్స్ ప్రకారం సెలెక్ట్ అయిన ఉపాధ్యాయులు ఉన్నారని, దాదాపుగా అందరికీ పీహెచ్డీ, నెట్, స్లెక్టు క్వాలిఫై, హైలీ క్వాలిఫై అయిన ఉపాధ్యాయులు విద్య బోధన చేస్తున్నారన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయుల్లో పీహెచ్డీ పూర్తి చేసిన వారు ఎక్కువ మంది ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రెగ్యులరైజ్ కోసం యూనివర్సిటీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పూర్తి డీటెయిల్స్ అన్ని సర్టిఫికెట్స్, ఎస్ఎస్సి టు పీహెచ్డీ వరకు వెరిఫికేషన్ పూర్తి చేసినట్లు వివరించారు. అసెంబ్లీ చివరి సమావేశంలో వీఆర్ఏలను పర్మినెంట్ చేయడం జరిగిందని, కాని గతంలో ముఖ్యమంత్రి కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారని, ఇదే కాకుండా ఎన్నికల మేనిఫెస్టోలో కూడా యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీయూ కాంటాక్ట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతోనే మహిళలపై దాడులు అరికట్టొచ్చు

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి**
- **రమేష్‌బాబు**

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా మహిళలపై హింస రోజు రోజుకి పెరిగిపోతుందని, ఈ కాలంలో హత్యలు హత్యాచారాలు దాడులు విపరీతంగా పెరిగిపోయాయని, వీటన్నింటిని అరికట్టాలంటే మహిళలంతా ఏకమై ఐక్య పోరాటం చేయడం వల్లనే సాధ్యమవుతుందని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు అన్నారు.

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఐద్వా మహిళా సంఘం విస్తతస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ మండలాల మహిళా ఐద్వా కార్యకర్తలు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనువాద సిద్ధాంతం ప్రకారం మహిళలను వంటింటికే పరిమితం చేసి పిల్లల కనే యంత్రంగా భావించే ధోరణితో ఉన్నారని అన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా మహిళలందరూ పోరాటాలు చేయాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బిజెపిని ఓడించి ప్రజల మధ్య ఐక్యతను చాటేందుకు కషి చేయాలని, పెరుగుతున్న ధరలను అరికట్టటానికి సంఘటిత పోరాటం చేయాలని అన్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీ ఎన్నుకున్నట్టు తెలిపారు.



మాట్లాడుతున్న రమేష్‌బాబు

నూతన జిల్లా కమిటీ ఇదే..

జిల్లా అధ్యక్షులుగా ఏ. అనిత, జిల్లా కార్యదర్శిగా బి.సుజాత, జిల్లా ఉపాధ్యక్షులుగా కె. లావణ్య, జిల్లా ఉపాధ్యక్షులుగా బి.అనసూయ, జిల్లా సహాయ కార్యదర్శిగా షేక్ మీరా, గంగామణి మరో ఆరుగురిని జిల్లా కమిటీ సభ్యులుగా

వైభవంగా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలి

- **ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జూన్ 2నుండి 22 వరకు నిర్వహించే ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ లలో ఏర్పాట్లు చేసే విధంగా అందరూ కషి చేయాలని ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్ అన్నారు.

గురువారం ఇందల్ వాయి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో తహసీల్దార్ టివి రోజా, ఎంపిడిఓ రాములు నాయక్ ఎంపిఓ రాజ్ కాంత్ రావులతో కలిసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పతాకావిష్కరణ, తెలంగాణ రైతు దినోత్సవం రైతులతో సహపంక్తి భోజనాలు,

పోలీసుశాఖ వారిచే 'సురక్షా దినోత్సవం' తెలంగాణ విద్యుత్తు విజయోత్సవం' విద్యుత్తు రంగంలో విజయాలు, సింగరేణి సంబురాలు, 'తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం' ఇండస్ట్రియల్, ఐటీ కారిడార్లలో సభలు, సాగునీటి దినోత్సవం' సాగునీటి రంగంలో విజయాలపై సభలు, 'ఊరూరా చెరువుల పండుగ సాంస్కృతిక హేల చెరువు కట్టలపై సభలు, తెలంగాణ సంక్షేమ సంబురాలు' సంక్షేమ పథకాలపై లబ్ధిదారులతో సభలు, జై తెలంగాణ సుపరిపాలనా దినోత్సవం' ప్రజలకు కలిగిన మేలును తెలియజేసే కార్యక్రమాలు, తెలంగాణ సాహిత్య దినోత్సవం' కవి సమ్మేళనాలు, కవితల పోటీలు, పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణ రన్' తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం' మహిళా ఉద్యోగులకు సన్మానం,' తెలంగాణ వైద్య, ఆరోగ్య దినోత్సవం"తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం' పల్లెలు సాధించిన ప్రగతిపై, తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం' పట్టణ ప్రగతి ద్వారా సాధించిన ప్రగతిపై కార్య క్రమాలు, తెల ంగాణ గిరిజనోత్సవం' గిరిజన గ్రామాల్లో కార్యక్రమాలు,తెలంగాణ మంచినీళ్ళ పండుగ తాగునీటి రంగంలో సాధించిన విజయాలపై సభలు తెలంగాణ హరితోత్సవం' మొక్కలు నాటే కార్యక్రమం,తెలంగాణ విద్యా దినోత్సవం' విద్యారంగంలో సాధించి విజయాలపై సభలు, తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం' ప్రార్ధనా మందిరాల్లో కార్యక్రమాలు, అమరుల సంస్మరణ' అమరులకు శ్రద్ధాంజలి. హైదరాబాద్‌ఒ 22 అమరుల స్మారక చిహ్నం ప్రారంభం తదితర కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్‌నాయక్

పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఐడిసిఎఫ్ ప్రోగ్రాం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు, ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు విటమిన్ ఏ ద్రావణం పంపిణీ ప్రత్యేక కార్యక్రమం గురువారం నిర్వహించారు. పట్టణంలోని వడ్డెర కాలనీలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ ఓ డాక్టర్ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మాట్లాడుతూ.. ఈనెల 25 నుంచి వచ్చే నెల 8 వరకు ఫోర్ట్ నైట్ ప్రోగ్రాం ఉంటుందని తెలిపారు. ప్రతిరోజు ఇంటింటికి ఆరోగ్య సిబ్బంది వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు, విటమిన్ ఏ ద్రావణం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది అనురాధ, సౌందర్య, స్వప్న, ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖర్, కౌన్సిలర్, సంగీత ఖాందేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిర్మన్ పల్లి లో కంటి వెలుగు శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కంటి వెలుగు కార్యక్రమం ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలె శుక్రవారం ప్రారంభిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి టీ శ్రీధర్, ఇందల్ వాయి మండల విస్తరణ అధకారి శంకర్, ఎంపిటిసి చింతల దాస్ తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, ఎంపిడిఓ రాములు నాయక్, ఎంపిఓ రాజ్ కాంత్ రావు లు పాల్గొనున్నారని వారన్నారు. శిబిరంలో 18 సంవత్సరాల పై బడిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్ష నిర్వహించడం జరిగుతుందని, ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి కంటి పరీక్ష శిబిరానికి రప్పించే విధంగా చూడాలని, ఇప్పటికే గ్రామంలో ప్రచారం నిర్వహించామని వరించారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.